






రోగుల పట్ల మర్యాదగా వ్యవహరించండి

- మంచి మాటలతోనే సగం రోగం తగ్గించాలి
- ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులను గౌరవించాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ

ఖమ్మం, జూలై 28 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల డాక్టర్లు, సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మాటలతోనే సగం రోగం తగ్గిపోవాలని సూచించారు. ఖమ్మం జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి ఆదివారం ఉదయం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల ఆసుపత్రి ఆవరణ అంతా పరిశీలించారు. అన్నీ వార్డులను తిరగడంతోపాటు ఆసుపత్రి ఆవరణలో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను తిలకించి ఇలా ఎందుకు ఉంచారని అధికారులను ప్రశ్నించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మంచి పూల మొక్కలతో చక్కటి వాతావరణం కల్పించాలని ఆదేశించారు. మంత్రి తుమ్మల ఆసుపత్రిని పరిశీలిస్తున్న సమయంలో ఓ మహిళ వచ్చి ఆసుపత్రి సిబ్బంది రోగులతో అగౌరవంగా మాట్లాడుతున్నారని ఫిర్యాదు చేసింది. దాంతో మంత్రి తుమ్మల వెంటనే వైద్యాధికారులతో మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేదే పేదలని, అలాంటి వారి పట్ల గౌరవంగా వ్యవహరించాలని సూచించారు. రోగులతోపాటు వారి సహాయకులుగా వచ్చేవారికి మర్యాద ఇవ్వాలన్నారు. అనారోగ్యంతో వచ్చే వారి పట్ల మీరు దురుసుగా ప్రవర్తిస్తే రోగం పెరుగుతుందే తప్ప తగ్గదన్నారు. రోగులు, వారి సహాయకుల పట్ల ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు ఎలా వ్యవహరించాలో కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. వారం రోజుల్లోగా ఖమ్మం ఆసుపత్రి తీరు మారాలని, ఆవరణ అంతా శుభ్రంచేయాలన్నారు. అనంతరం మంత్రి తుమ్మల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఖమ్మం ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత లేకుండా చూస్తామన్నారు. ఇందుకోసం కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రిని రప్పించి ఈ ఆసుపత్రికి కావాల్సిన అన్ని సౌకర్యాలు కలిపిస్తామన్నారు. ప్రస్తుతం 650 పడకలు అవసరం ఉండగా 450మాత్రమే ఉన్నాయని, అదనపు పడకలు ఏర్పాటు చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామన్నారు.ఖమ్మం ఆసుపత్రిలో అన్నిరకాల వైద్యం బాగా అందుతుందన్న విశ్వాసం కల్పిస్తామన్నారు. కోట్లాది రూపాయలతో భవనాలు నిర్మించి సౌకర్యాలు ఏర్పాటు చేసినా ప్రభుత్వ వైద్యం పట్ల ప్రజల్లో కొంత నమ్మకం లేక ఎక్కువ మంది వినియోగించు కోలేకపోతున్నారన్నారు. ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి అన్నివర్గాల వారు వచ్చేలా మోడల్ ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామన్నారు.

జర్నలిస్టుల ఇళ్లస్థలాల ప్రక్రియను వేగవంతం చేయండి

ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు మంత్రి తుమ్మల ఆదేశాలు 6

అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యను అందించాలనే ఆలోచనపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించే అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యను అందించటం సాధ్యమేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక విద్యను అందించటం ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలల మూతకేనన్న సందేహాలూ వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి వాటిని బోధనా కేంద్రాలుగా రూపాంతరం చేయడానికి ప్రభుత్వం అడుగులు వేయడం స్వాగతించే అంశమే.. అయినా తమకు బాధ్యతలు అప్పగించకపోవడంపై ఉపాధ్యాయులు, బీఈడీ, డీఈడీ పట్టభద్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం జరుగుతున్న డీఎస్సీ పరీక్షలకు 2లక్షల 75వేల మంది డీఈడీ, బీఈడీ అభ్యర్థులు హాజరవుతున్నారు. డీఎస్సీ ప్రకటన, పరీక్షల నిర్వహణ వరకు బాగానే ఉన్నా పాఠశాలలు మినహా ఇతర సముదాయాల్లో బోధనతో ముడిపడి ఉన్న బాధ్యతలకు తాము అర్హులం కాదా అని ఇప్పటికే ప్రాథమిక, ఉన్నత స్థాయి శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. ఎలాంటి అకడమిక్ శిక్షణ లేనివారు, కేవలం పదోతరగతి, ఇంటర్ విద్యా అర్హత ఉన్న వారు ఎలా పూర్వప్రాథమిక విద్యా తరగతులు నిర్వహిస్తారని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పట్టభద్రులు ప్రశ్నిస్తున్నారు.



ప్రయోగం ఫలించేనా?

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యపై భిన్నాభిప్రాయాలు
- ఆలోచన మంచిదే అయినా ఆచరణపైనే అనుమానాలు
- శిక్షణ, అర్హత లేకుండా మూడో తరగతి వరకు బోధన ఎలా?
- ఇప్పటికే తలకుమించిన పనిభారంతో అంగన్‌వాడీలు సతమతం
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు, పట్టభద్రులు

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 28: అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యను అందించాలని సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ ఇటీవల ఆదేశించారు. ఈ మేరకు అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధిపై రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించారు. అయితే రాష్ట్ర విద్య పరిశోధన శిక్షణ సంస్థ కేంద్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ మార్గదర్శకాలను మాత్రం పట్టించుకోలేదు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో అంగన్‌వాడీ సెంటర్ల అభివృద్ధి కార్యాచరణ, పిల్లలకు నేర్పాల్సిన పాఠ్యాంశాలు, పిల్లల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని చిన్న వయసులో పిల్లలకు నేర్పవలసిన వ్యక్తిగత పరిశుభ్రత, అంశాలు, నైపుణ్యాలతో కోర్సు సిద్ధం చేశామని ప్రకటించారు. అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలకు నేర్పించాల్సిన అంశాలను వివరిస్తూ అంగన్‌వాడీ సెంటర టీచర్లకు ప్రత్యేక బుక్లెట్ రూపొందించి, జూలై మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీలకు అందించనున్నారు. రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లోని ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రెగ్యూలర్ పాఠశాలల్లో చేరే నాటికి పిల్లలను సంసిద్ధం చేయడమే ప్రభుత్వ ఉద్దేశం. ఇందుకోసం కొత్తగా ప్రీప్రైమరీ సిలబస్‌ను సిద్ధం చేసింది. జూలై 15 నుంచి 20 వరకు ప్రత్యేకంగా 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' పేరిట ప్రత్యేక కార్యక్రమం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. తొలి విడతగా జిల్లాలో మండలానికి రెండు చొప్పున అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ పాఠశాలలుగా తీర్చిదిద్దనున్నారు. అనంతరం జిల్లాలోని మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీప్రైమరీ పాఠశాలలుగా మార్చనున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాలలుగా పరిగణిస్తారా ?

అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలుగా పరగణిస్తారా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎల్‌కేజీ, యూకేజీ బోధన చేసినా ఒకటో తరగతి నుంచి ప్రాథమిక పాఠశాలల్లో కొనసాగించాలని పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. అలా చేయనిపక్షంలో రానున్న రోజుల్లో ప్రైమరీ పాఠశాలలు మూతపడే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు బీఎల్‌వో డ్యూటీతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన వివిధ రకాల పనులను నిర్వహించాల్సి ఉంటుంది. ఈ పనులు చేస్తూనే అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వప్రాథమిక విద్యను ఎలా అందిస్తారని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను కేవలం ఒకటి, రెండు గదుల్లో మాత్రమే నిర్వహిస్తుంటారు. మూత్రశాలలు, ఆట స్థలం ఉండదు. ఎక్కువగా అద్దె భవనాల్లోనే అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణ ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రాథమిక పాఠశాలల నిర్వహణ ఎలా సాధ్యపడుతుందో అధికారులకే తెలియాలి.

టెట్ పాసైన వాళ్లు కనిపించలేదా ?

ఉపాధ్యాయ ఉద్యోగాలకు బీఈడీ పాసై, టెట్ క్వాలీఫై అయితేనే అర్హులని ప్రభుత్వ అదేశాలు ఉండగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎక్కువమంది పది, ఇంటర్ చదువుకొని 50 సంవత్సరాల వయస్సు పైపడిన వారే అధికంగా ఉన్నారు. వారు ఎలా ప్రాథమిక పాఠశాలల్లో బోధన చేస్తారని పలువురు టెట్ అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. డీఈడీ, బీఈడీ ఉత్తీర్ణులై, ఇంటర్, డిగ్రీల్లో పలు సబ్జెక్టులలో పట్టాలు పొంది ప్రవేశ పరీక్ష రాసి, రెండేళ్ల పాటు శిక్షణ పూర్తి చేసిన పలువురు అభ్యర్థులు ఉద్యోగాల కోసం చూస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకుండా అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ప్రాథమిక విద్యను అంగన్‌వాడీ టీచర్లతో ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో డీఈడీ, బీఈడీ వారితోనే ప్రీస్కూల్ తరగతులు నిర్వహిస్తే బాగుటుందని కోరుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నాం

విజయ్, టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ స్కూల్స్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. అర్హత ఉన్న ఉపాధ్యాయులనే ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో టీచర్లుగా నియమించాలి. అర్హులకు అన్యాయం జరిగితే సంఘం తరుపున పోరాటాలు నిర్వహిస్తాం.

పాఠశాలలుగా గుర్తించలేం

నాగేశ్వరరావు, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

అంగన్‌వాడీ కేంద్రాలను తల్లితండ్రులు పాఠశాలలుగా గుర్తించరు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసే ప్రీప్రైమరీలో అర్హులైన ఉపాధ్యాయులనే నియమించాలి. అంగన్‌వాడీ టీచర్లతో విద్యను అందించటం విద్యార్థులకు అన్యాయం చేయటమే అవుతుంది. ఒక్కరు, ఇద్దరు టీచర్లతో ఆరు తరగతులు నిర్వహించటం సాధ్యపడదు.



అక్కా బాగున్నావా?

- మహిళా కూలీలకు పొంగులేటి ఆత్మీయ పలకరింపు
- కూసుమంచి మండలం తుర్కగూడెంలో రెవెన్యూశాఖ మంత్రి పర్యటన

కూసుమంచి, జూలై 28: "ఏం అక్కా ఎలా ఉన్నారు.. ఓ చెల్లి పనులు ఎలా సాగుతున్నాయి ? ఏం విత్తనాలు వేస్తున్నారు." అంటూ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మహిళా కూలీలను ఆత్మీయంగా పలకరించారు. కూసుమంచి మండలం తుర్కగూడెంలో ఆదివారం పర్యటించిన మంత్రి తిరిగి వస్తుండగా రోడ్డు వెంట పొలంలో నాటువేస్తున్న కూలీలను చూసిన మంత్రి పొంగులేటి తన వాహనాన్ని నిలిపారు. పొలంలో నాట్లు వేస్తున్న మహిళా కూలీల వద్దకు వెళ్లిన మంత్రి కూలీల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఏం విత్తనాలు వేశారని ఆరా తీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు, వ్యవసాయ కూలీలకు అండగా ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా తమ దగ్గరకు వచ్చి ముచ్చటించిన మంత్రిని చూసి కూలీలు ఆనందం వ్యక్తం చేశారు.

భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం



గోదావరి తగ్గుముఖం

- భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ
- ఇంకా నీళ్లల్లోనే పలు కాలనీలు
- పునరావాస కేంద్రాల్లో వరద బాధితులు
- వరద ప్రాంతాలను పరిశీలించిన ఐటీడీఏ పీవో, ఏఎస్పీ

భద్రాచలం, జూలై 28: భద్రాచలం వద్ద గోదావరి తగ్గుముఖం పట్టింది. శనివారం అర్ధరాత్రి 12 గంటలకు 53.9అడుగులకు చేరిన నీటిమట్టం అనంతరం మూడు గంటల పాటు నిలకడగా ఉండి తగ్గడం ఆరంభించింది. ఉదయం 7.30 గంటలకు 52.9 అడుగులకు తగ్గడంతో తుది ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఈ క్రమంలో వరద తగ్గుతూ సాయంత్రం 6 గంటలకు 49.8 గంటలకు తగ్గింది. రాత్రి 8:35 గంటలకు 47.9అడుగులకు తగ్గడంతో రెండో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. సోమవారం నాటికి గోదావరి వరద మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దేవస్థానం కల్యాణకట్ట, స్నానఘట్టాలు ఇంకా వరదలోనే ఉన్నాయి. ఇదిలా ఉండగా దుమ్ముగూడెం మండలంలోని బైరాగులపాడు-సున్నంబట్టి వెళ్లే మార్గం పది రోజులుగా నీటిలో మునిగి ఉండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్, ఏఎస్పీ అంకిత్‌కుమార్ శంక్వార్‌లు ఆదివారం గోదావరి కరకట్ట పరిసరాలను పరిశీలించి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. అలాగే పునరావాస కేంద్రాల్లో వరద బాధితులకు అందుతున్న సౌకర్యాలు, వసతుల గురించి ఆరా తీశారు. అలాగే భద్రాచలం సీఐ సంజీవరావు, తహసీల్దారావు శ్రీనివాసరావులు పునరావాస కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి వరద బాధితులతో కలిసి భోజనాలు చేశారు.

భద్రాచలంలో ఇంకా నీళ్లల్లోనే పలు కాలనీలు

భద్రాచలంలోని అశోకనగర్ కొత్తకాలనీ, ఏఎంసీ కాలనీలు ఇంకా నడుం లోతు నీళ్లలోనే ఉన్నాయి. సరిహద్దున ఉన్న యటపాక వాగు మత్తడి పడటంతో ఆ వరద నీరు ఈ రెండు కాలనీల్లో ప్రవేశించాయి. ఇదే సమయంలో నీటిపారుదలశాఖ అధికారులు అశోకనగర్ కొత్తకాలనీ వద్ద ఏర్పాటు చేసిన మోటార్లు మొరాయించడంతో కాలనీల్లోకి నీరు ప్రవేశించింది. దీంతో కాలనీవాసులను భద్రాచలంలోని నన్నపనేని మోహన్ జిల్లా పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంకు తరలించారు. మొత్తం 106 కుటుంబాలకు చెందిన 343 మంది వరద బాధితులు ఇక్కడ పునరావాసం పొందుతున్నారు. రెండో రోజు కూడా వారు పునరావాస కేంద్రంలోనే ఉన్నారు. వారికి ఐకేపీ మహిళ సమాఖ్యల ఆధ్వర్యంలో భోజన ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా పునరవాస కేంద్రాన్ని సీపీఎం నాయకులు ఎంబి నర్సారెడ్డి, బండారు శరత్, నకిరికంటి నాగరాజు, సంద్ర భూపేంద్రలు పరిశీలించి వరద బాధితులకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.



వెంకటేశ్వర్లు (ఫైల్)

పశువులను వాగు దాటించేందుకు వెళ్లి..

- నీటిలో మునిగి పశువుల కాపరి మృతి
- కరివారిగూడెంలో ఘటన

జూలూరుపాడు, జూలై 28: పశువులను వాగు దాటిస్తుండగా నీట మునిగి ఓ పశువుల కాపరి మృతి చెందిన సఘటన ఆదివారం భద్రాద్రి జిల్లా జూలూరుపాడు మండలం కరివారిగూడెంలో జరిగింది. కరివారిగూడెం గ్రామానికి చెందిన రామవత్ వెంకటేశ్వర్లు(60) పశువుల కాపరి. ఆదివారం మరో పశువుల కాపరి గుగులోత్ బాలుతో కలిసి గ్రామానికి చెందిన రైతుల పశువులను మేపేందుకు తోలుకెళ్లాడు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు స్థానిక పెద్దవాగులో నుంచి పశువులను అవతలి ఒడ్డుకు తోలుకెళ్లేందుకు ఈతకొట్టుకుంటూ వెళ్లాడు. ఈ క్రమంలో వాగు మధ్యలోకి వెళ్లిన తరువాత వెంకటేశ్వర్లు కనిపించకపోవడంతో మరో పశువుల కాపరి బాలు ఆందోళనకు గురై ఈ విషయాన్ని గ్రామస్థులకు సమాచారం అందించాడు. వెంటనే గ్రామస్థులు ఘటనా స్థలానికి చేరుకొని పశువుల కాపరి వెంకటేశ్వర్లు కోసం గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి అతడి మృతదేహం లభించింది. ఘటనా స్థలాన్ని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రహమాన్ సందర్శించారు. మృతుడికి భార్య రామరాజ్యంతో పాటు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వెంకటేశ్వర్లు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జూలూరుపాడు ఎస్ఐ రాణా ప్రతాప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ఏజెన్సీలో ప్రసవ వేదన
- భద్రాద్రి ప్రభుత్వ వైద్యశాలలో ప్రసూతి వైద్యుల కరువు
- ఏడాదిన్నర కాలంగా ఇదే పరిస్థితి
- రేడియాలజిస్టు లేక నిరుపయోగంగా స్కానింగ్ విభాగం
- గర్భిణీలను ఇతర ప్రాంతాలకు రిఫర్ చేస్తున్న వైనం
- వైద్యుల కొరతతో స్వయంగా సిజేరియన్ చేసిన ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం

ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

వైద్యులు కావాలి

- భద్రాద్రి ఏరియా ఆసుపత్రిలో ప్రసూతి, పిల్లల వైద్య నిపుణుల భర్తీకి కసరత్తు
- నోటిఫికేషన్ జారీ చేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్

భద్రాచలం, జూలై 28: భద్రాచలంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ప్రసూతి పిల్లల వైద్య నిపుణులు, అనస్తీషియా వైద్యుల పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ కసరత్తు ప్రారంభించింది. ఈ నెల 25న 'ఏజెన్సీలో ప్రసవ వేదన' భద్రాద్రి ప్రభుత్వ వైద్యశాలలో ప్రసూతి వైద్యుల కరువు అనే ఐటం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ క్రమంలో ఇప్పటికే వైద్యవిధానపరిషత్ కమిషనర్‌తో పాటు ప్రభుత్వం ఈ విషయంలో సత్వరమే చర్యలు చేపట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి భద్రాద్రి వైద్యశాలలో ప్రసూతి వైద్యులు ముగ్గురు, పిల్లల వైద్య నిపుణులు ఇద్దరు, అనస్తీషియా వైద్యులు ఇద్దరిని కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు జిల్లా ఆసుపత్రుల సూపరింటెండెంట్ ఆదివారం డాక్టర్ రవిబాబు నోటిఫికేషన్ జారీ చేశారు. వాక్ఇన్ ఇంటర్వ్యూతో మంగళవారం పోస్టులను భర్తీ చేస్తామని, ఆసక్తి గల వారు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భద్రాచలం ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ ఛాంబర్‌కు రావాలని సూచించారు. ఈ క్రమంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు అనుభవ ధ్రువీకరణ పత్రాలు, జిరాక్స్ కాపీలతో రావాలని సూచించారు. ప్రసూతి వైద్యులకు రూ.2 లక్షలు, పిల్లల వైద్య నిపుణులకు రూ1.50 లక్షలు, ఎనస్తీషియా స్పెషలిస్టులకు రూ.1.50 లక్షల చొప్పున నెలవారి వేతనం చెల్లించనున్నట్లు వివరించారు.



ఏబీఏపీ జాతీయ కార్యదర్శిగా తిరుమలరావుకు నియామకపత్రం అందజేస్తున్న జాతీయ నాయకులు

కేరళలో అయ్యప్ప భక్తులకు అన్నవితరణ

- 10, 11న కాంచీపురంలో ఏబీఏపీ రాష్ట్ర సమావేశాలు
- జాతీయస్థాయి సమావేశంలో పలు తీర్మానాలు 6

'ముఖ్యమంత్రి అల్పాహారం' ఏదీ!?

- పాఠశాలల్లో గత సర్కారు హయాంలో ప్రారంభం
- ప్రస్తుత విద్యా సంవత్సరంలో అమలుపై కానరాని స్పష్టత 7

రాయల చంద్రశేఖర్

పోరాట జీవితం ఆదర్శం

- సంస్మరణ సభలో నివాళులు అర్పించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎమ్మెల్యే కూనంనేని 6

సింధుప్రియకు జాతీయస్థాయి

పరుగుపందెంలో బంగారు పతకం

తల్లాడ, జూలై 28: ఇటీవల గోవాలో జరిగిన జాతీయస్థాయి పరుగుపందెం పోటీల్లో తల్లాడ మండలం రంగంబంజర గ్రామానికి చెందిన ధర్మసోతు సింధుప్రియ బంగారు పతకం సాధించింది. సెప్టెంబరు ఒకటి నుంచి ఆరోతేదీ వరకు నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పరుగుపందెం పోటీలకు సింధుప్రియ ఎంపికైంది. గోవాలో జరిగిన 18వ జాతీయస్థాయి యూత్ స్పోర్ట్స్ అండ్ ఎడ్యుకేషన్ గేమ్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో 400మీటర్ల పరుగుపందెంలో సింధుప్రియ బంగారు పతకం సాధించింది. రంగంబంజర గ్రామానికి చెందిన ధర్మసోతు దశరథ్‌నాయక్, శిల్పా దంపతుల కుమార్తె అయిన సింధుప్రియ ఖమ్మంలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో బీజెడ్‌సీ సెకండియర్ చదువుతుంది.



బంగారు పతకాన్ని అందుకుంటున్న సింధుప్రియ

జాతీయస్థాయిలో బంగారు పతకం సాధించటంతోపా టు నేపాల్‌లో జరిగే అంతర్జాతీయ పరుగుపందెం పోటీలకు భారతదేశం తరపున సింధుప్రియ ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఆ నలుగురు ఎవరు!

» భద్రాద్రి దేవస్థానం నుంచి బదిలీపై వెళ్లే వారిపై ఉత్కంఠ

భద్రాచలం, జూలై 28: రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగుల సాధారణ బదిలీల ప్రక్రియ ఇప్పటికే ముగిసింది. కాగా దేవాదాయ శాఖ పరిధిలోని వివిధ దేవస్థానాల్లో పని చేసే ఉద్యోగుల బదిలీల అంశం చివరి దశకు వచ్చింది. ఏదైనా ప్రభుత్వ విభాగంలో 40 శాతం మంది ఉద్యోగులకే బదిలీలు ఉంటాయనే నిబంధన క్రమంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో పని చేసే ఉద్యోగుల్లో ఎవరికి సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర దేవస్థానాలకు బదిలీ అవుతుంది అనే అంశంపై ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది. దేవస్థానంలో మొత్తం 90 మంది రెగ్యులరు సిబ్బంది ఉండగా ఇందులో 17 మందిపరిపాలన విభాగంకు చెందిన వారు. వారిలో 13 మంది జూనియర్ అసిస్టెంటు ఆపై క్యాడర్‌కు చెందిన వారు ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిబంధన మేరకు 40 శాతంలో వెళ్లే ఉద్యోగులు ఎవరు అనే దానిపై స్పష్టత లేదని దేవస్థానం ఉద్యోగులే పేర్కొంటున్నారు. గతంలో పలుమార్లు వివిధ దేవస్థానాల్లో పని చేసిన వారికి మినహాయింపు ఉంటుందా?, ఉద్యోగంలో చేరిన నాటి నుంచి భద్రాద్రి దేవస్థానంలోనే కొనసాగుతున్న వారిని బదిలీ చేస్తారా? లేదా రెండింటిని కాకుండా మరేదైనా ప్రాతిపదికగా తీసుకుంటారా అనే విషయాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. దేవస్థానంలో ఇటీవల సస్పెండైన ఓ అధికారిని ఈ బదిలీల్లోనే ఇతర ప్రాంతాలకు బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు దేవస్థానం ఉద్యోగుల్లో ప్రచారం సాగుతోంది. కాగా దేవస్థానంలోని ఇంజనీరింగు విభాగంలో ఏఈ, డీఈలను సైతం నియమించే అవకాశాలున్నట్లు ప్రచారం సాగుతుండటంతో ఎక్కడ నుంచి వారిని బదిలీ చేస్తారనే దానిపై స్పష్టత రావడం లేదు. కాగా రాష్ట్రంలోని వేములవాడ, యాదాద్రి దేవస్థానాల్లో అధిక సంఖ్యలో ఉన్న ఉద్యోగుల్లో పలువురిని భద్రాద్రి దేవస్థానంలో ఖాళీలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడకు నియమించే అవకాశాలు లేకపోలేదని దేవస్థానం వర్గాల్లో ప్రచారం సాగుతోంది. ఇదిలా ఉండగా దేవాదాయ శాఖ ఉద్యోగుల బదిలీల అంశంపై దేవాదాయ శాఖ కమిషనర్, అదనపు కమిషనర్, ప్రధాన దేవస్థానాల ఈవోలు ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగుల బదిలీల విషయమై సమీక్షించినట్లు సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో స్పష్టత మరో రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉందని దేవస్థానం వర్గాలు పేర్కొంటున్నాయి.



భద్రాద్రి రామాలయం

రాయల చంద్రశేఖర్ పోరాట జీవితం ఆదర్శం

» సంస్మరణ సభలో నివాళులు అర్పించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి, ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 28: అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల సమస్యలపై అనేక పోరాటాలు చేసిన ఆదర్శవంతమైన జీవితాన్ని దివంగత రాయల చంద్రశేఖర్ గడిపారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు నివాళులు అర్పించారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటి సభ్యులు రాయల చంద్రశేఖర్ సంస్మరణ సభను ఆదివారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ సభకు హాజరైన మంత్రులు తుమ్మల, పొంగులేటి రాయల చంద్రశేఖర్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాయల చంద్రశేఖర్ తన జీవితాంతం నిరుపేదలు, రైతులు, రైతు కూలీలు, గిరిజన, ఆదివాసీల సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. పార్టీ సిద్దాంతాలకు, క్రమశిక్షణకు తుది వరకు కట్టుబడి పనిచేశారన్నారు. ఐదు దశాబ్దాల పాటు విప్లవ జీవితం గడిపిన ఎన్నడూ పార్టీ విధానాలను వ్యతిరేకించలేదని గుర్తు చేశారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కేజీ రామచం దర్, కే రంగయ్య, అరుణోదయ సంస్కృతి సమాఖ్య నాయకురాలు విమల, ఎన్డీ రాష్ట్ర నాయకులు పోలారి, ధర్మాల సురేశ్, మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు చంద్రన్న, గుమ్మడి నర్సయ్య, చంద్ర అరుణ, ప్రభాకర్, వీ కృష్ణ, గోకినేపల్లి వెంకటేశ్వర్లు గుర్రం అచ్చయ్య, కే రమ, ఎస్ఎల్ పద్మ నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, పోటు రంగారావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్

భూమి ఉన్నంత వరకు ఎర్రజెండా పోరాటాలు ఉంటాయి

» 'ముదిగొండ' అమరవీరుల వర్ధంతి కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం

ముదిగొండ, జూలై 28: భూమి ఉన్నంతవరకు ప్రజల కోసం ఎర్రజెండా పోరాటాలు ఉంటాయని సీపీఎం రాష్ట్ర నాయకుడు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ముదిగొండ భూపోరాట అమరవీరుల 17వ వర్ధంతి సభ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూపోరాటంలో పోలీసు తూటాలకు ఎదురొడ్డి అమరులయ్యారని పేర్కొన్నారు. వారి రక్తంతో తడిసిన నేల ముదిగొండ గడ్డ అని, వారి ఆశయ సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ కూలీలు జానెడు జాగ ఇంటిస్థలం కోసం ఆందోళన చేస్తున్న పేదలపై ఆనాటి రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం కర్కశంగా లాఠీచార్జ్ చేస్తూ పోలీసు కాల్పులు జరగకపోవడంతో ఏడుగురు అమరులు కావడంతోపాటు 18మంది క్షతగాత్రులను చేసిందన్నారు. ప్రస్తుత రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రుణమాఫీకి రేషన్‌కార్డు నిబంధన పెట్టడం సరైంది కాదన్నారు. ఇటీవల ప్రకటించిన బడ్జెట్లో ఆరు గ్యారెంటీల ఊసే లేదన్నారు. అనంతరం అమరవీరుల స్థూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, వైస్ఎంపీపీ మంకెన దామోదర్, టీఎస్.కల్యాణ్, భద్రయ్య, ఇరుకు నాగేశ్వరరావు, మందరపు వెంకయ్య, కందుల భాస్కర్‌రావు, బట్టు రాజు, సతీష్ పాల్గొన్నారు.



స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

అమరుల ఆశయ సాధనకు పోరాడుదాం

» కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 28: ప్రజా సమస్యలు పరిష్కారానికి అమరుల ఆశయ సాధనకు పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు, సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలో నిర్వహించిన బాల నాగేంద్రరెడ్డి సంతాపసభలో వారు మాట్లాడారు. బాల నాగేంద్రరెడ్డి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షునిగా సీపీఐ జిల్లా నాయకులుగా నిస్వార్థంగా పనిచేశారన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. జిల్లా సమితి కార్యదర్శి పోటు ప్రసాద్, నాయకులు దండి సురేశ్, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, ఏపూరి లతాదేవి, శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి నిర్మల, మల్లేష్, గాంధీ, ఏసు, రవి, మహేష్, బాల శ్రీకాంత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

రామయ్యను దర్శించుకున్న ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్



రామాలయంలో ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్

భద్రాచలం, జూలై 28: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారిని ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అలాగే ఆదివారం సందర్భంగా స్వామి వారికి అర్చిత సేవల్లో భాగంగా అభిషేకం, స్వర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణం నిర్వహించారు.

జిల్లా అథ్లెటిక్స్ జట్ల ఎంపిక

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 28: రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా అథ్లెటిక్స్ జట్లను ఆదివారం ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా సుమారు 84 మంది క్రీడాకారులు హాజరైనారు. ఎంపికల్లో భాగంగా అండర్- 14, 16, 18, 20 బాలురు, బాలికలు విభాగాలతో పాటు మెన్ అండ్ ఉమెన్ విభాగాలలో ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపికల్లో ప్రతిభ చూపి జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా అథ్లెటిక్స్ అసోసి యేషన్ కార్యదర్శి ఎండీ షఫీక్‌అహ్మద్ ప్రకటించారు. బాలికల జట్టులో సుమతి, తిరుపతమ్మ, అనిత, మనుశ్రీ, వైశాలి, రిష్వశ్రీ, సాగరిక, ఉమాశ్రీ, బింధు, నవ్య ఎంపిక కాగా బాలుర జట్టులో హేమంత్, ముబిన్, ఇర్ఫాన్, అనిల్, అక్షర్, విక్రమ్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు. వారు ఆగస్టు 7న సరూర్‌నగర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. ఎంపికలను అథ్లెటిక్స్ సంఘం బాధ్యులు సుధాకర్, రవి, వెంకటేశ్వర్లు, తిరుపతి, ముజీబ్, కోచ్ గౌస్ తదితరులు సమీక్షించారు.



పరుగు పోటీలో తలపడుతున్న బాలికలు

జక్కంపూడి కుటుంబానికి యుగంధర్ పరామర్శ

తల్లాడ, జూలై 28: తల్లాడ మండలం బిల్లుపాడు గ్రామంలో మృతిచెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు జక్కంపూడి కృష్ణమూర్తి కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తుమ్మల యుగంధర్ పరామ ర్శించారు. కృష్ణమూర్తి చిత్రపటా నికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జక్కంపూడి కుమారులు కిషోర్, రాము, సోదరుడు చంద్రశేఖర్‌ను ఓదార్చారు.



నివాళులర్పిస్తున్న యుగంధర్

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

ఖమ్మం రూరల్ జూలై 28: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన మహమ్మద్ షబ్బీర్, ఈగ రాజిరెడ్డి ఈ ఏడాది మార్చినెలలో చత్తీష్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన రోడ్డుప్రమాదంలో మృతిచెందారు. బాధిత కుటుంబాలకు ఖమ్మం గ్రానైట్‌ఫ్యాక్టరీ అసోసియేషన్, ఖమ్మం గ్రానైట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒక్కో కుటుంబానికి రూ.3లక్షల 64వేల ఆర్థికసాయంను ఆదివారం గ్రానైట్ అసోసియేషన్ సభ్యులు అందజేశారు. మృతుల పిల్లల పేరుతో బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ పత్రాలను బాధితకుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో గ్రానైట్ లారీ ఓనర్స్ అధ్యక్షుడు సురేందర్, ఉపాధ్యక్షుడు జనార్ధన్, కార్యదర్శి నాగరాజు, కోశాధికారి వెంకటేశ్వరరావు, గ్రానైట్ ఫ్యాక్టరీ అసోసియేషన్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ, కార్యదర్శి రాజేశ్, రఘునందన్‌రెడ్డి, బుచ్చిబాబు, మహిపాల్‌రెడ్డి, వెంకట్, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

'రైల్వేగూడ్స్ షెడ్‌ను కొత్తగూడెంలో ఏర్పాటు చేయాలి'

ఇల్లెందు, జూలై 28: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోనే రైల్వే గూడ్స్ షెడ్ నిర్మాణం చేయాలని భద్రాద్రి జిల్లా ఫర్టిలైజర్ పెస్టిసైడ్స్ అసోషియేషన్ ప్రతినిధి బృందం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను కోరింది. ఆదివారం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు నాళ్ల సోమ సుందర్, జనరల్ సెక్రెటరీ దుర్గా ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు బూరుగుపల్లి ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు వంకాయలపాటి రామలింగయ్య, కోశాధికారి దొడ్డి నాగేశ్వరరావులు కేంద్ర మంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. రైలు మార్గం కలిగిన కొత్తగూడెంలోనే గూడ్స్ షెడ్ నిర్మాణం చేయాలని, అన్ని మండలాలకు అందుబాటులో ఉంటుందని మంత్రికి తెలిపారు. ఎరువులు, నిత్యావసర వస్తువుల రవాణా ఖర్చులు తగ్గుతాయని వివరించారు. ఈ విషయమై స్పందించిన మంత్రి సంజయ్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ దృష్టికి విషయం తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వృద్ధ దంపతుల ఆత్మహత్యాయత్నం?

● ఒకరు మృతి?.. మరొకరు గల్లంతు

మణుగూరు, జూలై 28: బావిలో దూకి ఓ వృద్ధ దంపతులు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన భద్రాద్రి జిల్లా మణుగూరు మండంలోని పగిడేరు గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. పగిడేరు గ్రామంలోని ఎస్టీ కాలనీలో నివాసముంటున్న వృద్ధ దంపతులు కె. రామచంద్రయ్య, భార్య సరోజనమ్మ(69) బావిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఈ ఘటనలో భార్య సరోజనమ్మ మృతదేహం లభ్యమైంది. రామచంద్రయ్య కోసం స్థానికులు గాలిస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని సరోజనమ్మ కోసం కోసం గాలిస్తున్నారు.

సెప్టెంబరు 8న గెంటేల నారాయణరావు వర్ధంతి

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 28: నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలకు భూ విరాళం ఇచ్చిన దాత గెంటేల నారాయణరావు 63వ వర్ధంతిని సెప్టెంబరు 8న నిర్వహిస్తున్నట్లు కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యవర్గం తెలిపింది. ఆదివారం నగరంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో పూర్వవిద్యార్థులు మాట్లాడారు. సంఘం అధ్యక్షుడు నల్లమోతు తిరుమలరావు మాట్లాడుతూ రెండు పుస్తకాల ఆవిష్కరణ, జనరల్ బాడీ సమావేశం,కార్యక్రమానికి నారాయణరావు బంధువులు, పూర్వ విద్యార్థులు,ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

కేరళలో అయ్యప్ప భక్తులకు అన్నవితరణ

» ఆగస్టు 10, 11 తేదీల్లో కాంచీపురంలో ఏబీపీపీ రాష్ట్ర సమావేశాలు

» జాతీయస్థాయి సమావేశంలో తీర్మానాలు » హాజరైన ఐదు రాష్ట్రాల ప్రతినిధులు

ఖమ్మంకార్పొరేషన్, జూలై 28: శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులకు కేరళలో అన్న వితరణ చేయాలని ని ర్ణయించినట్లు అఖిల భారత అయ్యప్పధర్మ ప్రచారసభ (ఏబీపీపీ)జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్ తెలిపారు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏబీపీ పీ జాతీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావే శంలో కార్యవర్గసభ్యులు పలు తీర్మానాలను ఆమోదిం చారు. ఏబీపీపీ జాతీయకార్యదర్శిగా బేతి తిరుమలరావును నియమిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేయగా జాతీయ అధ్యక్షుడు ఆయనకు నియామకపత్రం అందచేశారు. అనంతరం ఏబీపీపీ ఆధ్వర్యంలో కేరళలోని నారాయణ తోడు ప్రాంతంలో అన్నదాన మందిరం నిర్మించాలని తీర్మానించారు. ఆగస్టు 10, 11 తేదీల్లో తమిళనాడులోని కాంచీపురంలో ఏబీపీపీ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించాలని తీర్మానించగా, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణాకు చెందిన ఏబీపీపీ ప్రతినిధులు హాజరైన ఈ జాతీయస్థాయి సమావేశంలో అయ్యప్ప సేవారత్న అవార్డును ప్రధానం చేయాలని నిర్ణయించారు. అనంతరం జాతీయ అధ్యక్షుడు అయ్యప్పదాస్ మాట్లాడుతూ ఏబీపీపీ ఆధ్వర్యంలో అయ్యప్ప భక్తులు ఆధ్యాత్మిక సేవలతో పాటు సామాజిక సేవలు అందించాలన్నారు. ఖమ్మం వేదికగా జాతీయ సమావేశం నిర్వహించటం శుభ పరిణామన్నారు. త్వరలో రాష్ట్రాల వారీగా సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ జాతీయ సమావేశంలో తెలంగాణ అధ్యక్షుడు టీవీ. పుల్లంరాజు, కార్యదర్శి సిద్ధు, కోశాధికారి శ్రీనివాస్, ఐదు రాష్ట్రాల సమన్వయకర్త రాచర్ల రమేష్ జాతీయ ఉపాధ్యక్షుడు వీరాస్వామి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదిమోహన్‌రెడ్డి, కార్యదర్శి చంద్ర, కోశాధికారి రాజశేఖర్, అన్నదానకమిటీ కార్యదర్శి హరిప్రసాద్ పాల్గొన్నారు.



తిరుమలరావుకు నియామకపత్రం అందచేస్తున్న జాతీయ నాయకులు

వైరా 'మురుగు'పాలిటీ..

» జాతీయ రహదారిపై డ్రెయినేజీ నీరు » దుర్గంధం వెదలజల్లుతున్నా పట్టించుకోని అధికారులు » ఇబ్బందులు పడుతున్న జనం

వైరా, జూలై 28: వైరా మునిసిపాలిటీలో డ్రెయినేజీ నిర్వహణ అధ్వానంగా తయారైంది. ఇది మునిసిపాలిటీనా... లేక మురుగుపాలిటీనా అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్నినెలల నుంచి జాతీయ ప్రధాన రహదారిపై డ్రెయినేజీ మురుగునీరు ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతున్నప్పటికీ కనీస పారిశుధ్య పనులు చేయటం లేదు. ప్రతిరోజూ మునిసిపాలిటీలో పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పుకుంటున్న మునిసిపల్ పాలకవర్గం, అధికారులకు జాతీయ ప్రధాన రహదారిపై ప్రవహించే డ్రెయినేజీ మురుగునీరు గురించి పట్టించుకోవడం లేదు. గత మంగళవారం నుంచి శుక్రవారం వరకు మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో ఉన్న మురుగుగుంతల్లో దోమల నివారణకు కిరోసిన్ బాల్స్ వదలడంతోపాటు మందు పిచికారి కూడా చేశారు. రాత్రివేళ దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. డివైడర్ల మధ్యలో ఉన్న చెత్తాచెదారాన్ని, పూడికను తొలగించారు. ఈ పనుల కోసం లక్షలాదిరూపాయల బిల్లులు చేసుకుంటున్నప్పటికీ వైరాతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది ప్రజలు తిరిగే ప్రధాన రహదారిపై ఉన్న మురుగునీటి గురించి మునిసిపల్ అధికారులకు చీమకుట్టినట్లు కూడా లేదనే విమర్శలున్నాయి. ఒక అపార్టుమెంట్‌కు చెందిన మురుగునీరు కొన్నినెలల నుంచి రోడ్డుపైనే ప్రవహిస్తుంది. తహసీల్దార్, రవాణాశాఖ, ఏసీపీ కార్యాలయాలు, ఐఎంఎల్ డిపోతోపాటు ఎదురుగానే దాదాపు 600మంది విద్యార్థినులు వసతి పొందుతున్న తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, చుట్టుపక్కల నివాసాలు ఉన్నాయి. ఈ అపార్టుమెంట్‌లోని వ్యర్థనీటిని ఎటువైపు వెళ్లకుండా రెండువైపులా నివాసాల వారు అడ్డుకట్ట వేయడంతో ఆమురుగునీరు రోడ్డుపైనే ప్రవహిస్తుంది. ఈ అపార్టుమెంట్‌లో తహసీల్దార్, ఎస్ఐ, ఫైర్‌స్టేషన్ ఇన్‌చార్జ్ అధికారి, ఉపాధ్యాయులు, అనేకమంది ముఖ్యులున్నప్పటికీ చోద్యం చూస్తున్నారనే తప్ప చర్యలు తీసుకోవడం లేదు. నేషనల్ హైవే అధికారులు, మునిసిపాలిటీ అధికారులకు మధ్య పూర్తిగా సమన్వయం కరువైందనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా మునిసిపాలిటీ అధికారులు పారిశుధ్య పనులకు సంబంధించి ప్రచార ఆర్భాటాలను పక్కనపెట్టి చిత్తశుద్ధితో పారిశుధ్యాన్ని మెరుగుపర్చేవిధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జాతీయ ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న డ్రెయినేజీ నీరు

జర్నలిస్టుల ఇళ్లస్థలాల ప్రక్రియను వేగవంతం చేయండి

» ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు మంత్రి తుమ్మల ఆదేశం

» నగరంలో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

ఖమ్మం, జూలై 28(ఆంధ్రజ్యోతిప్రతినిధి): ఖమ్మం నగరంలో జర్నలిస్టుల ఇళ్లస్థలాల సమస్యను పరిష్కరించి సత్వరమే ఇళ్లపట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించేలా ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఖమ్మం నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి తుమ్మల తన క్యాంపు కార్యాలయంలో కలెక్టర్, నగర కమిషనర్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మైనారిటీ మత పెద్దలతో చర్చించి ఖమ్మం నగరంలో అవసరమున్న చోట ఖబరస్తాన్, షాదీఖానా ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం ఉండేలా చూడాలన్నారు. శిథిలావస్థలో ఉన్న సోషల్ వెల్ఫేర్, మైనారిటీ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్‌తో పాటు ఇతర ప్రభుత్వ పాఠశాలల భవనాలు ఉంటే తక్షణమే ఖాళీచేసి వాటిని కూలగొట్టి నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అత్యవసరం ఉన్నచోట తాత్కాలిక భవనాల్లో కార్యకలాపాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్‌లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేదని, అసౌకర్యంగా ఉందని ప్రజల నుంచి ఫిర్యాదులున్నాయని మంత్రి తెలిపారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ సత్వరమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖమ్మం నగరంలో వరద నీరు ఎక్కడా నిలవకుండా డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచాలన్నారు. సారథీనగర్ రైల్వే అండర్ అండర్‌బ్రిడ్జిని సత్వరమే ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. గోళ్లపాడు ఛానల్ ఆధునీకరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ పరిధిలోని ప్రైవేటు స్థలాల్లో పరిశుభ్రత ఉండేలా యజమానులకు తగిన ఆదేశాలు జారీచేసి పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పౌర సమాజానికి పెనువిపత్తుగా మారిన గంజాయి, డ్రగ్స్ మహమ్మారి ఖమ్మంలో కనపడకుండా చేయాలన్నారు. వెలుగుమట్ల అర్బన్‌పార్క్‌లో ప్రజలకు ఆహ్లాదం పంచేలా మౌలిక వసతులు కలిపించాలన్నారు. మెయిన్‌రోడ్డు నుంచి పార్కు వరకు రహదారి మంజూరైందని, సత్వరమే నిర్మాణం చేపట్టాలని తుమ్మల ఆదేశించారు. అర్బన్‌పార్కులో ఆహ్లాదం కోసం చేపట్టాల్సిన నిర్మాణాలపై శాఖల వారీగా నివేదిక తయారు చేయాలన్నారు. వెలుగుమట్ల అర్బన్‌పార్కును మణిహారంలా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు.



కలెక్టర్, కమిషనర్‌తో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

'ముఖ్యమంత్రి అల్పాహారం' ఏదీ!?

» పాఠశాలల్లో గత సర్కారు హయాంలో ప్రారంభం » ప్రస్తుత విద్యా సంవత్సరంలో అమలుపై కానరాని స్పష్టత

ఖమ్మం ఖానాపురం హవేలీ, జూలై 28: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయడంతో పాటు.. వారి ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం గా పౌష్టికాహారం అందిస్తున్న విద్యాశాఖ రాగి జావ, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోంది. వీటితోపాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 'ముఖ్యమంత్రి అల్పాహార' పథకం (చీఫ్ మినిస్టర్స్ బ్రేక్ ఫాస్ట్ స్కీం)ను కొన్ని పాఠశాలల్లో ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం మారడంతో 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ ముఖ్యమంత్రి అల్పాహార పథకం పై ఎలాంటి ఉత్తర్వులు అందకపోవడంతో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ పథకం అమల్లో ఉండకపోవచ్చుననే వాదనలు వినపడుతున్నాయి. ఉదయం వేళల్లో రాగి జావ, మధ్యాహ్న భోజన సమయానికి మధ్యలో ఈ అల్పాహారాన్ని అందించేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని 1,288 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చదివే సుమారు 80 వేల మంది విద్యార్థులకు పైగా ప్రభుత్వం ఇప్పటికే మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నది. 2024-25 విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని విద్యాశాఖ భావించింది. కాని ప్రభుత్వం మారడంతో ముఖ్యమంత్రి అల్పాహార పథకం కొనసాగుతుందో లేదోనని అధికారులకు తెలియని పరిస్థితి. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద మధ్య తరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులే చదువుతుంటారు. వీరి తల్లిదండ్రులు ఎక్కువగా వ్యవసాయ పనులు చేస్తూ, విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తుంటారు.

విద్యార్థులకు చదువుతోపాటు ఉచిత మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫామ్స్ అందిండంతో విద్యార్థుల తల్లిదండ్రులకు కొంత ఆర్థిక భారం తగ్గుతుందనే ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలలకు పంపిస్తున్నారు. దీంతో పాటు ముఖ్యమంత్రి అల్పాహార పథకం కూడా కొనసాగిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య అధికంగా ఉంటుందని పలువురు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

అల్పాహార మెనూ..

విద్యార్థులకు అందించే అల్పాహార మెనూ ఉప్మా, పొంగల్, కేసరి, కిచిడీ లాంటి వాటితో పాటు వాటిలోకి పల్లి చట్నీ, సాంబారు అందించాలనే ఉత్తర్వులు జారీచేశారు. ప్రసుతం అందిస్తున్న రాగీజావ, కోడిగుడ్ల పంపిణీని కూడా కొనసాగిస్తూనే, రాగి జావ, మధ్యాహ్న భోజన సమయానికి మధ్య ఈ అల్పాహారాన్ని అందించాలని గత ప్రభుత్వం సూచించింది. జిల్లాలో



మొదట కొన్ని పాఠశాలల్లోనే అందించిన ముఖ్యమంత్రి అల్పాహార పథకం 2024-25 విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయాలనే ఆలోచనతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యాశాఖ అధికారులను ఆదేశించడం జరిగింది. కాని ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకం అమల్లో నేటికి ఎలాంటి సమాచారం లేకపోవడంతో, ఈ ఏడాది ఈ పథకం అమలు ఉండకపోవచ్చునని అనుమానాలు వినబడుతున్నాయి..

ఉద్యమకారుల హామీలను నెరవేర్చాలి



అమరవీరుల స్థూపానికి వినతిపత్రం అందిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై28: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని అమరవీరుల స్థూపానికి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా ఉద్యమకారులకు 250 చదరపు గజాల స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.10లక్షల ఇస్తామన్న హామీని నెరవేర్చాలన్నారు. ఉద్యమకారులకు ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో తగ్గిన ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర కీలకమన్నారు. గత ప్రభుత్వం ఉద్యమకారులను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఈసందర్భంగా తమ సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి విన్నవించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, బచ్చల పద్మాచారి, పెళ్లూరి విజయ్‌కుమార్, బోడా వీరన్న, రాంబాబునాయక్, భూక్యా శ్రీనివాస్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏన్కూర్‌లో రహదారుల మరమ్మతు పనులు

ఏన్కూరు, జూలై28: ఏన్కూరు నుంచి తిమ్మరావుపేట వరకు ప్రమాదకరంగా ఉన్న రోడ్డు మరమ్మతు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. బురదరాఘవాపురం సమీపంలో కోతకు గురైన రోడ్డు రాజలింగాల సమీపంలోని కల్వర్టు, టీఎల్‌పేట సమీపంలోని చప్టా అత్యంత ప్రమాదభరితంగా ఉన్నాయి. ఎప్పుడు ఏప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయపడిపోతున్నారు. ఈవిషయంపై ఆంధ్రజ్యోతి అనేకసార్లు కథనాలు ప్రచురించింది. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం మరమ్మతుల కోసం కోటి రూపాయలను మంజూరు చేసింది. ప్రస్తుతం బురదరాఘవాపురంసమీపంలోని రోడ్డు కోతకు గురైన సైడ్‌వాల్ పనులు చకచకా సాగుతున్నాయి. వీటి పనులను ఆర్అండ్‌బీ శాఖ ఏఈ ప్రవీణ్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదభరితంగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



బురదరాఘవాపురం వద్ద కోతకు గురైన రోడ్డుకు సైడ్‌వాల్ పనులు చేస్తున్న దృశ్యం

గమ్యానికి చేరుకోకుండానే...
మార్గమధ్యలో నిలిచిన లారీలు

● రెండు రోజులుగా డ్రైవర్ల అవస్థలు

బూర్గంపాడు, జూలై 28: గోదావరి వరద ఉధ్రుతితో పలు చోట్ల ప్రధాన రహదారిపైకి నీరు చేరాయి. దీంతో ముడిసరుకుతో భద్రాచలం మీదుగా ఒరిస్సా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లే లారీలను అధికారులు బూర్గంపాడు మండల పరిధిలో నిలిపివేశారు. బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక నుంచి మొదలుకొని పినపాక పట్టీనగర్ వరకు జాతీయరహదారి వెంబడి వందల సంఖ్యలో లారీలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా తినడానికి తిండి లేక, పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొందని డ్రైవర్లు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులపైకి చేరిన వరద నీరు వెనక్కి తగ్గగా, రాకపోకలను పునరుద్ధరించారు.



సారపాకలో జాతీయ రహదారిపై నిలిచిన లారీలు

కేటీపీఎస్‌లో
పట్టాలు తప్పిన బొగ్గు వ్యాగన్లు



పట్టాలు తప్పిన బొగ్గు వ్యాగన్లు దృశ్యం

పాల్వంచ, జూలై 28: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ కేటీపీఎస్ 5,6 దశల్లోని రైల్వే ట్రాక్‌పై బొగ్గు వ్యాగన్లు ఆదివారం ఉదయం పట్టాలు తప్పాయి. సింగరేణి నుంచి కేటీపీఎస్ 7వ దశకు బొగ్గు తరలించి, తిరుగు ప్రయాణంలో 5,6 దశల మీదుగా వెళుతుండగా ఒక్కసారిగా గార్డ్ బోగీతో పాటు మరో మూడు బోగీలు పట్టాలు తప్పాయి. కేటీపీఎస్ 5,6 దశల అధికారులు యుద్ధ ప్రతిపాదికన రీరైలింగ్ పనులు చేపట్టారు. బోగీలు పట్టాలు తప్పిన విషయం వాస్తవమేనని, రీ రైలింగ్ పనులు చేపట్టామని 5,6 దశల సీఈ ప్రభాకరరావు తెలిపారు.

ఆశ్రమపాఠశాల సామాగ్రి తరలింపు అడ్డగింత

దుమ్ముగూడెం, జూలై 28: రామచంద్రునిపేట గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి ఆదివారం వాహనంలో తరలిస్తున్న సామాగ్రిని స్థానిక ఆదివాసీ పెద్దలు, యువకులు అడ్డుకున్నారు. పాత ఇనుప మంచాలు, టేబుల్స్ ట్రంకు పెట్టెలు, నోట్ పుస్తకాలను ఒక వాహనంలో తరలిస్తున్నారు. అక్రమంగా సామాగ్రిని ఎలా తరలిస్తారంటూ, వాహనాన్ని ఆశ్రమపాఠశాల గేటు ఎదుట నిలిపివేసిన గ్రా మస్థులు ఐటీడీఏ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అనుమతి పత్రం ఉందని హెచ్ఎం అనడంతో చూపించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. వీరిలో కల్లూరి కామయ్య, కంగాల నాగయ్య, రేసు బాలకృష్ణ, కల్లూరి రాంబాబు, కంగాల రాముడు తదితరులున్నారు. వాహనాన్ని సోమవారం అధికారుల కు అప్పగిస్తామని గ్రామస్థులు తెలిపారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ఆశ్రమపాఠశాల నుంచి వస్తువులను అక్రమం గా తరలిస్తున్న హెచ్ఎంను సస్పెండ్ చేయాలని ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లుదొర, కాంగ్రెస్ నాయకుడు కోడి చంటిలు డిమాండ్ చేశారు. ఈ విషయమై హెచ్ఎం వీరమ్మ వివరణ ఇస్తూ, నిబంధనల మేరకు తీర్మానం, సర్క్యులర్ల ప్రకారం పాత సామాగ్రిని విక్రయించామన్నారు. ఆ పత్రాలు కనబడకపోవడంతో వెతుకుతున్నామన్నారు.



వాహనంలో తరలిస్తున్న సామాగ్రిని అడ్డుకుంటున్న గ్రామస్థులు

పాత కక్షలతో డిగ్రీ విద్యార్థి హత్య

● పిడిగుద్దులతో ఇంటర్ విద్యార్థుల దాడి

● ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి



విష్ణు(ఫైల్)

పాల్వంచ, జూలై 28: పాతకక్షల నేపథ్యంలో ఓ డిగ్రీ విద్యార్థిని ఇంటర్ విద్యార్థులు పిడిగుద్దులతో దాడిచేసి హత్య చేసిన ఘటన శనివారం భద్రాద్రి జిల్లా పాల్వంచలో సంచలనంగా మారింది. పోలీసులకు అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం.. పాల్వంచ మండలం యానంబైలు గ్రామానికి చెందిన అల్లూరి విష్ణు(22) పాల్వంచలోని ఓ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతూ, ఖాళీ సమయంలో డీజేలను అద్దెకు ఇస్తుంటాడు. అయితే గత సంవత్సరం పాల్వంచ జూనియర్ కాలేజీ విద్యార్థులతో డీజే విషయంలో ఇతడికి వాగ్వాదం జరిగింది. అప్పటి నుంచి ఇరువర్గాల వారు శత్రువులుగా మారిపోయారు. శనివారం మధ్యాహ్నం మండలంలోని సోములగూడెం వెళ్లే దారిలోని పార్కులో డిగ్రీ విద్యార్థులైన విష్ణు అతడి స్నేహితులు అఖిల్, బాలాజీ మరికొంత మందితో కలిసి మద్యం తాగుతున్నారు. ఈ క్రమంలో మద్యంలోకి స్టఫ్ కోసం రోడ్డుపైకి వచ్చిన విష్ణుకు గతంలో ఇతడితో గొడవపడిన ఇంటర్ విద్యార్థులు తారసపడ్డారు. ఈ సమయంలో వారు పరస్పరం దూషించుకుని ఎవరికి వారు వెళ్లిపోయారు. కానీ కొద్ది సేపటి తరువాత అల్లూరి విష్ణుపై ఐదుగురు విద్యార్థులు మూకుమ్మడిగా దాడి చేసి చాతిపై పిడిగుద్దులు గుద్ది పారిపోయారు. స్థానికులు వెంటనే అతడిని పాల్వంచ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పాల్వంచ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దాడి చేసిన విద్యార్థుల కోసం గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా ఇరువర్గాల మధ్య ఈ ఘర్షణకు ఓ అమ్మాయి వ్యవహారమే కారణమని, పోస్టుమార్టం గది వద్ద విద్యార్థులు బాహాటంగానే చర్చించుకోవడం గమనార్హం.

పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు..?

ఈ దుర్ఘటనపై మృతి చెందిన విద్యార్థి విష్ణు తండ్రి రామ్మూర్తి ఆదివారం పాల్వంచ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన కుమారుడు విష్ణు మృతికి సీలీంరాజ్, భరణతేజ, మోహన్‌చంద్, గోపి, మణికంఠ, మరి కొందరు కారణమని వారిపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. విష్ణును హత్య చేసి పరారీలో ఉన్నవారిగా భావిస్తున్న ఆరుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరు తమ నేరం అంగీకరించనట్లుగా తెలుస్తుంది. వీరందరూ మైనర్లు కావడంతో వారిని కోర్టులో హాజరుపరచడానికి పోలీసులు కావలసిన ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

విహార యాత్రలకు, శుభకార్యాలకు
ఆర్టీసీ అద్దె బస్ సర్వీస్‌లు

» కొత్తగూడెం డీఎం దేవేందర్‌గౌడ్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జూలై 28: విహార యాత్రలకు, శుభకార్యాలకు ఆర్టీసీ అద్దె బస్ సర్వీస్‌లను ఆసక్తి గలవారు వినియోగించుకోవాలని కొత్తగూడెం డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం పరిసర ప్రాంత ఉద్యోగులు, వ్యాపారులు, ప్రజలకు ఏమైనా పెళ్లిళ్లు, శుభకార్యాములకు, విహార యాత్రలకు, అద్దె ప్రాతిపదికన ఆర్టీసీ బస్సులు అద్దెకు ఇస్తామని పేర్కొన్నారు. ఆర్టీసీ అద్దె బస్సులను వినియోగించడం వలన అతి తక్కువ ధరలతోనే రాకపోకలు నిర్వహించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చునని సూచించారు. పూర్తి వివరాల కోసం 99592 25959, 93467 28893, 90103 74644 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి



నాగభూషణం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీధర్‌రెడ్డి

మదిర, జూలై 28: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. ఆదివారం మధిరలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు జరిగినా, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యకర్తలతో కలిసి ప్రధాని మోదీ మన్‌కీబాత్ కార్యక్రమాన్ని టీవీలో తిలకించారు. అనంతరం ఇటీవల మృతి చెందిన పార్టీ నాయకుడు కాసిన నాగభూషణం కుటుంబాన్ని పరామర్శించారు, అలాగే అస్వస్థతకు గురెన సీపీఎం పార్టీ కౌన్సిలర్ కట్టా గాంధీను పరామర్శించారు. ఈకార్యక్రమంలో ఏలూరు నాగేశ్వరరావు, పెరుమాళ్లపల్లి విజయరాజు, చిలువేరు సాంబశివరావు, రమేష్, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

క్రిమినల్ చట్టాల రద్దు కోసం పోరాడుదాం

» హైకోర్టు అడ్వకేట్ ఎండీ సాధిక్ అలీ

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై28: కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమల్లోకి తీసుకువచ్చిన మూడు క్రిమినల్ చట్టాల రద్దు కోసం మనమంతా సంఘటితంగాపోరాటాలకు సిద్ధం కావాలని హైకోర్టు అడ్వకేట్ ఎండీ సాధిక్ అలీ అన్నారు. ఆదివారం ఖమ్మం నగరంలోని టీటీడీపీ సమావేశ మందిరంలో వీరనారీమణుల ఆశయసాధన సమితి ఆధ్వర్యంలో నూతన క్రిమినల్ చట్టాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. మన ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీయడమే కాకుండా, పౌరహక్కులను స్వేచ్ఛను హరించే చట్టాలని ఈమూడు క్రిమినల్ చట్టాల రద్దు కోసం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈచట్టాలను కేంద్ర ప్రభుత్వం గతంలోనే ప్రవేశపెట్టి ఈఏడాది అమల్లోకి తెచ్చిందన్నారు. వీటి ప్రకారం మట్లాడడం, ప్రశ్నించబడడం, విమర్శించడం కూడా అతిపెద్ద నేరాలుగా పరిగణిస్తారన్నారు. కోర్టులలో కాలయాపన పరిస్థితులను మార్చే బదులు ఈమూడు చట్టాలను తీసుకు రావడం వెనుక ప్రసజాస్వామ్యస్ఫూర్తి దెబ్బతీసే ఉద్దేశం కనిపిస్తుందన్నారు. మనకు రాజ్యాంగం కలిపించిన భావ ప్రకటన స్వేచ్ఛకు ఈచట్టాల కింద అణాచాలని పాలకులు చూస్తున్నారన్నారు. మనం వీటికి వ్యతిరేకంగా పిడికిలి బిగించడమే కాకుండా సంఘటిత పోరాటాలకు దిగాలని కోరారు. చట్టాల రద్దు చేసే వరకు విశ్రమించకూడదన్నారు. ఈసదస్సులో పంజాకుల లక్ష్మీనారాయణ, ప్రముఖ పిల్లల వైద్యుడు కూరపాటి ప్రదీప్‌కుమార్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోతు బద్రునాయక్, షేక్ నజీమా, భూక్యా ఉపేంద్రబాయి, జాన్‌బీ, నస్రీన్, జ్యోతి, చందు, త్రివేణి, స్పందన, భవాని, నాగలక్ష్మి, సుష్మ, మీగడ రామారావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సాధిక్‌అలీ

ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి



సైదులు(ఫైల్)

తిరుమలాయపాలెం, జూలై28: ప్రమాదవశాత్తూ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బచ్చోడు గ్రామానికి చెందిన కుమ్మరికుంట్ల సైదులు(42) ట్రాక్టర్ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. ఆదివారం గ్రామానికి చెందిన ఉలిపలుపుల సుధాకర్ అనే రైతు పొలంలో నాటు వేస్తుండగా, ట్రాక్టర్ తోలేందుకు వెళ్లాడు. వరిపొలంలో ట్రాక్టర్ తోలుతుండగా సైదులుకు ఫిట్స్ రావడంతో బురదలో పడి కూరుకుపోయాడు. ఊపిరి ఆడక మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమేరకు మృతుడి బంధువులు గ్రామంలో న్యాయం చేయాలని కోరుతూ కొద్దిసేపు ఆందోళన చేశారు. రైతు మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం చేయడంతో ఆందోళన విరమించారు. ఈమేరకు మృతుడి బంధువులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనాస్థలాన్ని ఎస్ఐ గిరిధర్‌రెడ్డి సందర్శించి వివరాలు సేకరించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సింగరేణి మాజీ ఉద్యోగి..



లోకేశ్వరరావు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

మణుగూరు, జూలై 28: సింగరేణి మణుగూరు ఏరియాలో పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఉడతనేని లోకేశ్వరరావు (64)ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతదేహన్ని సీఐటీయూ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, ప్రసాద్, రాములు, రత్నం, ఈశ్వరరావు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

చికిత్సపొందుతూ మహిళ...

ఖమ్మం రూరల్ జూలై 28: చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏన్కూరు మండలం ఇందిరానగర్ కాలనీకి చెందిన నిన్నెకంటి పార్వతి(34) తన భర్త రమేష్‌తో విభేదాల కారణంగా రెండేళ్లుగా చింతకాని మండలం కొదుమూరులోని తన తల్లిగారి ఇంటి వద్దనే ఉంటుంది. ఈ నెల 26వ తేదీన ఖమ్మం వెళుతున్నానని చెప్పి, ఇంట్లో నుంచి బయటకి వెళ్లిన ఆమె మండల పరిధిలోని తీర్థాల వద్దకు వచ్చి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. పార్వతిని గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. సంఘటనపై మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

● మోరంపల్లిబంజరలో ఘటన



రామిరెడ్డి(ఫైల్)

బూర్గంపాడు, జూలై 28: అప్పుల బాధ తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మోరంపల్లిబంజరలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన నగులూరి రామిరెడ్డి(35) ఐటీసీ క్యాజువల్‌గా విధులకు వెళుతూ, గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మృతుడి భార్య వరలక్ష్మి వరినాటుకు వెళ్లగా... ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కౌలు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించే రామిరెడ్డి అప్పులు కావడంతో అప్పులు బాధలు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రామిరెడ్డి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గుండెపోటుతో
అంగన్‌వాడీ ఆయా మృతి



దయమ్మ(ఫైల్)

కల్లూరు, జూలై 28: గుండెపోటుతో అంగన్‌వాడీ ఆయా మృతి చెందిన సంఘటన మండలంలోని వెన్నవల్లి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..వెన్నవల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం-2లో ఆయాగా బొల్లెపోగు దయమ్మ(59) గత 25 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తుంది. కాగా శనివారం రాత్రి ఆమెకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రయివైట్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. ప్రాజెక్టు అధికారి మోహరున్నీసాబేగం, వెన్నవల్లి సెక్టార్ సూపర్‌వైజర్ సుజాత, సహచర అంగన్‌వాడీ టీచర్లు ఆయా మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ లభ్యం

ఇల్లెందు టౌన్, జూలై 28 : ఇల్లెందు పట్టణంలోని బీసీ బాలుర హస్టల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి బాణోత్ తనూష్ ఈ నెల 24వ తేదీన అదృశ్యమైన విషయం విధితమే. ఈ మేరకు ఇల్లెందు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అనంతరం.. పోలీసులు, కుటుంబ సభ్యులు, హస్టల్ సంక్షేమ అధికారి గాలింపు చర్యలు చేపట్టారు. హైదరాబాద్ వరకు వెళ్లి వచ్చినప్పటికి ఆచూకీ లభ్యం కాలేదు. అయితే ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో బాలుడు అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అతడిని ఆపి, ప్రశ్నించడంతో తప్పిపోయి వచ్చిన విషయాన్ని తిరుపతి పోలీసులకు బాలుడు తెలిపాడు. బాలుడు తెలిపిన వివరాల ప్రకారం.. గార్ల మండలం చిన్నబంజరతండాలో ఉన్న తల్లిదండ్రులకు తిరుపతి పోలీసులు సమాచారం అందించారు. వెంటనే ఇల్లెందు పోలీసులకు ఈ సమాచారం తెలియడంతో తిరుపతి పోలీసులను సంప్రదించి బాలుడి ఆచూకీని నిర్థారణ చేసుకున్నారు. గత ఐదు రోజులుగా బాలుడి ఆచూకీపై తీవ్ర తర్జనభర్జనలు పడ్డ పోలీసులు, అధికారులు, కుటుంబసభ్యులు ఆచూకీ లభ్యం కావడంతో ఊపిరిపీల్చుకున్నారు.

రోడ్లపైనే బడ్డీకొట్లు..

» పట్టించుకోని మునిసిపల్ అధికారులు

» రెండేళ్ల క్రితం బడ్డీ కొట్లను తొలగించిన సిబ్బంది

» రూ.నాలుగు లక్షలు ఖర్చు చేసిన వైనం

మధిరటౌన్, జూలై28: రోడ్ల వెంబడి ఉన్న డబ్బాకొట్లతో పట్టణంలో తీవ్ర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుంది. కాగా ప్రధాన రహదారితో పాటు కూడళ్లలో ఉన్న డబ్బాకొట్లను నాటి జిల్లా కలెక్టర్ గౌతమ్ తొలగింపు చేశారు. 25ఏళ్లుగా వ్యాపారం చేసుకుంటున్న వారిని ఇబ్బందులకు గురి చేయవద్దని పలువురు రాజకీయ నాయకులు ఆందోళనలు చేశారు. కానీ ఆందోళనలు పట్టించుకోకుండా 2022 లో వాటిని తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. తొలగింపు ప్రక్రియ కోసం మునిసిపల్ అధికారులు తీర్మానం చేసి రూ. 4లక్షలను కేటాయించి ఖర్చు చేశారు.

వ్యాపారులకు రూ.7లక్షల విలువ చేసే స్థలం కేటాయింపు

పోలీస్ సిబ్బంది బందోబస్తు మధ్య బడ్డీ కొట్లను తొలగించడమే కాకుండా, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. బడ్డీకొట్లను తొలగించే క్రమంలో వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపిస్తామని చెప్పిన అధికారులు సరిగ్గా రెండు నెలల్లోనే మునిసిపల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం మధ్యలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని బడ్డీకొట్లు పెట్టుకునేందుకు ఒక్కొక్కరికి ఏడు లక్షలు విలువ చేసే స్థలాన్ని 64 మందికి లాటరీ ద్వారా కేటాయించారు. రోడ్ల వెంబడి బడ్డీకొట్లను తొలగించిన స్థలంలో మునిసిపాలిటీ వారు మొక్కలను నాటి పెంచారు. ఇంతలో ఎన్నికలు రావడం ప్రభుత్వం మారడంతో ఒకరి తర్వాత ఒకరు మరలా రోడ్లపైకి చేరడం ప్రారంభించారు.




మళ్లీ రోడ్ల పక్కన వెలిసిన దుకాణాలు

ఒకరి తర్వాత ఒకరు

ఒకరిద్దరు తొలత పరదాలు వేసుకొని వ్యాపారాలు చేసుకోవడం ప్రారంభించి సాయంత్రం వ్యాపారాలు ముగిసాక అన్నింటిని తొలగించుకోవడం మరలా ఉదయాన్నే వేసుకోవడం చేస్తూ వచ్చారు. క్రమంగా అందరూ ప్రభుత్వం కేటాయించిన స్థలంలో బడ్డీలు వేసుకున్న వారు కూడా రోడ్లపైకి చేరడం ప్రారంభించారు అధికారులు ఎవరూ కూడా పట్టించుకోకపోవడంతో శాశ్వతంగా దుకాణాలు ఏర్పాటు చేసుకునే ప్రయత్రం చేస్తున్నారు. ఇలా చేస్తే మళ్లీ అంతా మొదటికి వస్తుందని ట్రాఫిక్ చిక్కులు తప్పవని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికైనా రోడ్ల వెంబడి దుకాణాలు ఏర్పాటు చేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా కమిషనర్‌తో మాట్లాడి రోడ్ల వెంబడి బడ్డీకొట్లు ఏర్పాటు చేయకుండా చూస్తామని తెలిపారు.



రోడ్డు పక్కన ఉన్న బడ్డీకొట్లను తొలగిస్తున్న దృశ్యం(ఫైల్)

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

ఖమ్మం
8
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి
సోమవారం 29 జూలై 2024

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

ఖమ్మంరూరల్, జూలై28: మండలంలోని ఏదులాపురంలో అర్హులైన లబ్ధిదారులకు ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి సిఫారసుతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు ఉరడి సుదర్శన్‌రెడ్డి ఆదివారం అందజేశారు. ఏదులాపురం గ్రామానికి చెందిన యడవల్లి వెంకటమ్మకు మంజూరైన రూ.17వేలు, రేపాకుల ఉపేంద్రమ్మకు మంజూరైన రూ.15,500, గణపారపు సీతయ్యకు మంజూరైన రూ.14,500, రజనీకి మంజూరైన రూ.9,500 రూపాయల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా నాయకులు మామిండ్ల విష్ణువర్ధన్‌రెడ్డి, సీపీఎం నాయకులు దుండిగల నాగయ్య, గంధం నాగేశ్వరరావు, దిగుట్ల బ్రహ్మం, పొన్నెకంటి అనీష్, వేల్పుల జయప్రసాదరావు, ఆరెంపుల నరేష్, కొండ రవి, మామిండ్ల వెంకటరెడ్డి, మధు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పల్లెల్లో సదుపాయాల కల్పనే లక్ష్యం

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కూసుమంచి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన


అభివృద్ధి పనులు ప్రారంభించిన పొంగులేటి, సూర్యప్రకాశ్‌రావు చిత్రపటానికి నివాళులర్పించిన మంత్రి

కూసుమంచి, జూలై 28: పల్లెల్లో మౌళిక సదుపాయాల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రెవెన్యూశాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదివారం కూసుమంచి మండలం పాలేరు, తుర్కగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. పల్లెల్లో మురుగు నీటిసమస్య లేకుండా చూస్తామన్నారు. ఇందుకోసం సీసీ, బీటీ రోడ్ల వెంట డ్రెయిన్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. మాటల ప్రభుత్వం కాదని చేతల్లో చేసి చూపిస్తున్నామని అన్నారు.

37మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రభుత్వం మంజూరీచేసిన 37 సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపుకార్యాలయంలో అందజేశారు. తద్వారా మొత్తం 8.16 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూసుమంచి, తిరుమలాయపాలెం ఎంపీపీలు బాణోతు శ్రీనివాస్, మంగీలాల్, మాజీఎంపీపీలు జూకూరి గోపాలరావు, కొప్పుల అశోక్, చావా శివరామకృష్ణ, జొన్నలగడ్డరవి, మాధవీరెడ్డి హఫీజుద్దీన్, మంకినవాసు, వెంకటరెడ్డి, బీష్మాచారి, యడవల్లి రాంరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు

ఉచిత శిక్షణకు మంత్రి పొంగులేటి హామీ

పాలేరు నియోజకవర్గంలో పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్న నిరుద్యోగులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేయూత అందించేందుకు హామీ ఇచ్చారు. శిక్షణా సంస్థ రైట్ ఛాయిస్ అకాడమీ సంస్థ సహకారంతో త్వరలో జరుగనున్న గ్రూప్2, 3 పరీక్షలతో పాటు రానున్న పోలీసు ఉద్యోగాలకు సంబంధించి పొంగులేటి శ్రీనన్న ఉచిత నిరుద్యోగ కానుక పేరిట కోచింగ్ క్యాంపును ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి పోస్టర్‌ను కూసుమంచి క్యాంపు కార్యాలయంలో మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు.

మాజీ సొసైటీ చైర్మన్ కుటుంబానికి పరామర్శ

చింతకాని: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామ మాజీ సర్పంచ్, చింతకాని సొసైటీ మాజీ చైర్మన్ కోలేటి సూర్యప్రకాశ్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి కుటుంబాన్ని ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పరామర్శించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ,నాయకులు బొర్రా రాజశేఖర్, కోట రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ కొండపల్లి శేఖర్‌రెడ్డి, అంబటి వెంకటేశ్వర్లు, కిలారు మనోహర్‌బాబు, బందెల నాగార్జున, కొప్పుల గోవిందరావు, కన్నెబోయిన సీతరామయ్య, మందడపు శ్రీను, కొల్లి ఉపేందర్ పాల్గొన్నారు.

వైరాలో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాందాస్ పర్యటన


పాపయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి

వైరా, జూలై28: మండలంలో ఆదివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పర్యటించారు. పలు కుటుంబాలను పరామర్శించారు. ముందుగా వైరాలో కాంగ్రెస్ నాయకుడు ధార్న రాజశేఖర్ బంధువుల ఇంట్లో జరిగిన శుభ కార్యక్రమంలో మంత్రి, ఎమ్మెల్యే పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. మండలంలోని రెబ్బవరంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పగడాల పాపయ్య కుమారుడిని పరామర్శించారు. పాపయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆతర్వాత వల్లాపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఎంపీపీ వేల్పుల పావని బంధువైన రామారావును మంత్రి, ఎమ్మెల్యే పరామర్శించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, రెబ్బవరం ఎంపీటీసీ రాయల రమేష్, ఆత్మకమిటీ చైర్మన్ కోసూరి శ్రీను, రెబ్బవరం, అప్పగుర్తి మాజీ సర్పంచ్‌లు సాదం రామారావు, ఇటికాల మురళీ, నాయకులు కట్ల సంతోష్, మిట్టపల్లి నాగి, జాలాది రామకృష్ణ, మచ్చా రామారావు, పగడవరపు అశోక్ పాల్గొన్నారు.


రాయలను అభినందిస్తున్న గ్రానైట్ ఫ్యాక్టరీ స్లాబ్, టైల్స్ ఓనర్స్ అసోషియేషన్ సభ్యులు

లీజుల సరళీకృతం చేస్తేనే..
గ్రానైట్ పరిశ్రమ మనుగడ

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థల చైర్మన్ రాయల నాగేశ్వరరావు
- గ్రానైట్ స్లాబ్స్, టైల్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై28: క్వారీ లీజుల సరళీకృతం చేసి, తాత్కాలిక లీజులు మంజూరు చేస్తేనే గ్రానైట్ పరిశ్రమ మనుగడ సాధ్యమవుతుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ ఓనర్స్ అసోషియేషన్, ఖమ్మం గ్రానైట్ ఫ్యాక్టరీ టైల్స్ ఓనర్స్ అసోషియేషన్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని ఓ ఫంక్షన్ హాల్లో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయల మాట్లాడుతూ రైతుబిడ్డగా జన్మించి విద్యార్థి ఉద్యమాల్లో వామపక్షభావాలతో పెరిగానన్నారు. తొలుత ఖమ్మంలోని నామా నాగేశ్వరరావు గ్రానైట్ పరిశ్రమలో ఉద్యోగం చేశానన్నారు. అనంతరం 2000లో ముదిగొండలో గ్రానైట్ పరిశ్రమను స్థాపించానన్నారు. గ్రానైట్ సమస్యలను పరిష్కారానికి ఒకటికిరెండు మూడుసార్లు అధికారులను, ముఖ్యమంత్రిని, మంత్రులను కలిసి సమస్యలు వివరించాలన్నారు. అప్పుడే సమస్యల పరిష్కారానికి మార్గం ఆలోచిస్తారని అన్నారు. కేవలం సబ్సిడీల విడుదల చేస్తేనో, రాయల్టీ తగ్గిస్తేనో పరిశ్రమల సమస్యలు తీరవన్నారు. పరిశ్రమల మనుగడకు పూర్తి స్థాయిలో మనుగడ కావాలంటే ముఖ్యంగా పరిశ్రమకు కావాల్సిన ముడి సరుకు కావాలని, అందుకు గ్రానైట్ క్వారీ లీజులు సరళీకృతం చేయాలని, టెంపర్‌వరి లీజులు మంజూరు చేయాలని అప్పుడే పరిశ్రమ మనుగడ సాధ్యమవు తుందన్నారు. ఐదు హెక్టార్ల వరకు గ్రానైట్ లీజులను సరళీకృతం చేసి పాత పద్ధతిలో లీజులు మంజూరు చేయాలని, ప్రభుత్వ,ప్రైవేటు భూములకు టెంపర్‌వరీ లీజులు మంజూరుకు ప్రభుత్వంతో మాట్లాడి వచ్చేలా కృషి చేస్తానన్నారు. జిల్లాలోని ముగ్గురు మంత్రులు ఉపముఖ్యంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యయసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆర్థికశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహకారంతో గ్రానైట్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ అసోషియేషన్ అధ్యక్షులు ఉప్పలపాటి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి నల్లా శ్రీనివాసరెడ్డి, ట్రెజరర్ దొడ్డా రాకేష్, మాజీ అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, సాదు రమేష్‌రెడ్డి, యలమద్ది శ్రీనివాసరావు, తోపాటు పలువురు మాట్లాడుతూ గ్రానైట్ పరిశ్రమకు రాయల చేసిన ఎనలేని కృషిని అభినందించారు. ఈ కార్యక్రమంలో టైల్స్ అసోషియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పొట్లూరి శ్రీనివాస్, తెడ్డు రమేష్, ట్రెజరర్ కొల్లి హరికృష్ణారెడ్డి, వడ్డె రాంబాబు, మట్టపల్లి నాగేశ్వరరావు, వెల్లంపల్లి వెంకటేశ్వరరావు, ఖమ్మం గ్రానైట్ స్లాబ్ ఫ్యాక్టరీ(స్క్రాప్) పాలీషింగ్ ఓనర్స్ అసోషియేషన్ కార్యవర్గ సభ్యులు, గ్రానైట్ స్లాబ్, టైల్స్ అసోషియేషన్ సభ్యులు, గ్రానైట్ పరిశ్రమల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం


నగదు అందజేస్తున్న యువసేవాసమితి సభ్యులు

సత్తుపల్లిరూరల్, జూలై28: బ్లడ్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ బాబుకు చికిత్స నిమిత్తం రూ.19,247నగదును యువసేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. పట్టణంలోని ద్వారకాపూరి కాలనీకి చెందిన జావిద్ అనే బాబు హైదరాబాద్‌లోని ఓఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తల్లీదండ్రులకు నగదు అందజేసినట్లు నిర్వహకులు జొన్నలగడ్డ రాజు తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయండి

తిరుమలాయపాలెం, జూలై28: తిరుమలాయపాలెం వంద పడకల ఆసుపత్రి తరలించవద్దంటూ సోమవారం విపక్ష పార్టీల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిలపక్ష నేతలు కొమ్ము శ్రీను,కొండబాల కరుణాకర్, కొలిచలం స్వామి కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని వివిధ గ్రామాల్లోప్రచారం చేపట్టారు. ఆసుపత్రి వద్ద జరిగే ధర్నాకు హాజరు కావాలన్నారు.

ఆళ్లపాడులో వైద్యశిబిరం విజయవంతం


వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బోనకల్, జూలై28: మండలంలోని ఆళ్లపాడులో ఆదివారం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయంతమైంది. యశోద ఆసుపత్రిలో పని చేసిన సీనియర్ వైద్యుడు మహ్మద్ ఆజాద్ షరీష్ వైద్యపరీక్షలను నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆరోగ్య నియమాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కందుల పాపారావు, బుంగా రాములు, మరీదు వీరబాబు, మరీదు బరకయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సత్తుపల్లి విద్యార్థినులు

సత్తుపల్లి, జులై28: జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగిన అసోసియేషన్ అథ్లెటిక్స్ మీట్‌లో అత్యంత ప్రతిభ కనబరిచిన స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో 8వ తరగతి చదువుతున్న సీహెచ్.తిరుపతమ్మ 400మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అండర్-17విభాగంలో 10వ తరగతి చదువుతున్న జీ.ఉమాశ్రీ జావెలిన్‌త్రోలో తృతీయ స్థానాన్ని సాధించినట్లు పీడీ సీహెచ్.శ్రీదేవి తెలిపారు. వీరు వచ్చేనెల 7న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పాల్గొనున్నారు.

సమావేశానికి పంచాయతీ కార్యదర్శుల గైర్హాజరు

చింతకాని,జూలై28: మండల సర్వసభ్య సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు గైర్హాజరు కావటంతో ఎంపీపీ కోపూరి పూర్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పంచాయతీ కార్యదర్శులు రాలేదు. దీంతో ఎంపీపీ పూర్ణయ్య, జడ్పీటీసీ కిషోర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి షోకాజ్ నోటిసులు ఇవ్వాలని మండల ప్రజాప్రతినిధులు ఏకగ్రీవ తీర్మానించారు. మత్స్య, విద్యుత్, విద్యాశాఖలకు సంబంధించిన అధికారుల కూడా హాజరుకాకపోవడంతో వారిపై కూడా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారుల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎంపీటీసీలకు, జడ్పీటీసీ సభ్యులకు చివరిసమావేశం కావడంతో అధికారులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, తహసీల్దార్ అనంతరాజు, ఎంపీవో రవీంద్రప్రసాద్, మండల అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ పూర్ణయ్య

ఘనంగా గంగమ్మ బోనాల వేడుకలు

ఆషాఢమాసం సందర్భంగా ఏటా నిర్వహించే బోనాల వేడుకలు జిల్లావ్యాప్తంగా ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఖమ్మంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ బోనాలు వేడుకలు నిర్వహించారు. బోనకల్‌లో నవదుర్గాలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు ఊరేగింపుగా బోనాలతో వెళ్లి అమ్మవారికి వెళ్లి బోనాలను సమర్పించారు. వైరాలో కారుడ్రైవర్ల బోనాల సంబరాలు నిర్వహించారు. - నెట్‌వర్క్


వంగవీడులో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు


బోనకల్‌లో బోనాలతో ఊరేగింపుగా వస్తున్న మహిళలు


వైరాలో కారుడ్రైవర్ల బోనాల సంబరాలు

ప్రైవేటు పాఠశాలల అభివృద్ధికి
శేషుకుమార్ కృషి మరువలేనిది

మంత్రులు తుమ్మల, పొంగులేటి


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై28: ప్రైవేటు పాఠశాలల అభివృద్ధికి సూరపనేని శేషుకుమార్ సేవలు మరువలేనివని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ఆదివారం నగరంలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో శేషుకుమార్ రెండో వర్థంతి కార్యక్రమానికి మంత్రులు హాజరై మాట్లాడారు. శేషుకుమార్ జిల్లా నాయకుడి నుంచి రాష్ట్ర నాయకుడిగా ఎదిగారన్నారు. పాఠశాలల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారంలో ముందున్న వ్యక్తి అన్నారు. ఆయనతో ఉన్న అనుభందాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. అనంతరం ప్రవేటు పాఠశాలల సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 182 ప్రవేటు పాఠశాలల నుంచి 257 మంది ఉపాధ్యాయులకు శేషుకుమార్ పేరున ఉత్తమ ఉపాధ్యా అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ, పెమా అధ్యక్షుడు మువ్వా శ్రీనివాసరావు, శేషుకుమార్ కుటుంబ సభ్యులు, తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు, పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

తోపుడుబండ్లు, ల్యాప్‌టాప్‌ల వితరణ


తోపుడుబండ్లు అందిస్తున్న మురళీకృష్ణ తదితరులు

వైరా, జూలై 28: వైరాలో ఆదివారం డాక్టర్ కాపా మురళీకృష్ణ జన్మదినాన్ని వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మధ్య, నిరుపేద విద్యార్థులు ఇద్దరికి రాయితీపై రెండు ల్యాప్‌టాప్‌లను అందజేశారు. వీధివ్యాపారులు కూరగాయల వ్యాపారం నిమిత్తం పది తోపుడుబండ్లను పంపిణీ చేశారు. 15మందికి కంటిశస్త్రచికిత్సలు నిర్వహించారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, డాక్టర్ మురళీకృష్ణ, కాపా గోపాలరావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, తోటకూర శ్రీకాంత్, ఉంద్రు శ్యాంబాబు, వరలక్ష్మీ, లగడపాటి ప్రభాకర్‌రావు, పెనుగొండ ఉపేందర్, అబ్బూరి రమేష్, నూకల ప్రసాద్, వాసు, యనమద్ది శ్రీను,మిట్టపల్లి నాగి, సూర్యదేవర శ్రీధర్, చింతోజు నాగేశ్వరరావు, మచ్చా రామారావు, చెరుకూరి శ్రీను పాల్గొన్నారు.

తల్లాడలో కుట్టుమిషన్ వితరణ

తల్లాడ: మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన బంకా మౌనికకు ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్‌ను వితరణగా అందజేశారు. లయన్స్‌క్లబ్ పీడీజీ కాపా మురళీకృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా కుట్టుమిషన్‌ను బహూకరించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నిర్వాహకులు కర్నాటి లక్ష్మారెడ్డి, దారా శ్రీనివాసరావు, అధ్యక్షుడు బెల్లంకొండ ఆంజనేయులు, కార్యదర్శి కటికి వెంకటేశ్వరరావు, కోశాధికారి శీలం వెంకటరెడ్డి, దగ్గుల ప్రభాకర్‌రెడ్డి, చిట్టెం నర్సింహారావు, వేమిరెడ్డి చిన్నకృష్ణారెడ్డి, చాపల నర్సింహారావు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాల పనులకు శ్రీకారం


విగ్రహాల నిర్మాణం పనులు చేస్తున్న దృశ్యం

కల్లూరు, జూలై28: కల్లూరు మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో దాతల సహకారంతో చేపట్టిన జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు పనులకు ఆదివారం ఎంపీపీ బీరవల్లి రఘు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ శ్రీకారం చుట్టారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం ముందు భాగంలో కుడివైపున అంబేద్కర్, ఎడమవైపున మహాత్మగాంధీ విగ్రహాల నిర్మాణం చేపట్టారు. ఈ విగ్రహాల ఏర్పాటుకు స్థానిక ఆర్యవైశ్య సంఘం తరుపున రూ.1 లక్ష, పారిశ్రామిక వేత్త ఎంపీపీ రఘు సోదరడైన బీరవల్లి శ్రీనువాసరావు (ఎర్రబోయినపల్లి) మరో రూ.50 వేలు వితరణ చేశారు.మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రాంగణం ముఖద్వారం ఆర్చి నిర్మాణం, సీసీ రహదారులను నిర్మించనున్నారు. ఆగస్టు మొదటివారంలో ఎంపీపీ, జడ్పీటీసీల పదవీకాలం ముగియనున్నందున ఈలోగా పై విధంగా చేపట్టిన అభివృద్ధి పనులలను ప్రారంభించేలా సన్నహాలు చేస్తున్నట్లు ఎంపీపీ బీరవల్లి రఘు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సత్తుపల్లిరూరల్, జులై28: పట్టణంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్-3 పరిధిలోని సోమవారం చెట్ల కొమ్మలు నరికివేత కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ శరత్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నగర్, రాజీవ్‌రోడ్, న్యూ కొమ్మేపల్లి కాలనీ, రాజీవ్‌రోడ్, ఆర్‌కే హాస్పిటల్, గుడిపాడ్ రోడ్, వెంగళరావు నగర్ ఫీడర్లలో ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం 11.30వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు.

పెనుబల్లి ఆసుపత్రిలో దోమల నివారణకు చర్యలు

పెనుబల్లి,జూలై28: ఇటీవల వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరపీడితులు పెనుబల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి ఆవరణంలో విపరీతంగా దోమలు చేరడంతో ఆదివారం అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. ఆసుపత్రి ఆవరణంలో గడ్డితో చెత్తాచెదారం పెరిగి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. దోమలను నిర్మూలించాలని కాంగ్రెస్ నాయకుడు పొట్లపల్లి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే మట్టా రాగమయికి విన్నవించడంతో ఆమె ఆదేశాల మేరకు అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో అడవిమల్లెల వైద్యాధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శి ఎన్‌వీ.ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ-వ్యక్తికి తీవ్రగాయాలు

తల్లాడ, జూలై 28: తల్లాడ బస్టాండ్ వద్ద ఆదివారం ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌నడుపుతున్న తల్లాడ మండలం తెలగవరం గ్రామానికి చెందిన నల్లగొర్ల కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. సంఘటనా స్థలానికి బూకోల్ట్ సిబ్బంది చేరుకొని క్షతగాత్రుడిని 108 వాహనంలో చికిత్స కోసం వైరా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రంగమ్మకు నివాళులర్పించిన సండ్ర

తల్లాడ, జూలై28: మండల పరిధిలోని నూతనకల్‌లో గుండెపోటుతో మృతి చెందిన తూము రంగమ్మ(57)ఆదివారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నివాళులర్పించారు. గంగదేవిపాడు సొసైటీ చైర్మన్ తూము వీరభద్రరావు తల్లి రంగమ్మకు 12రోజుల క్రితం గుండెపోటు రావడంతో చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ రంగమ్మ మృతిచెందింది. రంగమ్మకు భర్త, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నారు. రంగమ్మకు తుమ్మల యుగంధర్, ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, సీఐ భానుప్రకాష్, కనగాల వెంకట్రావ్, దుగ్గిదేవర వెంకట్‌లాల్ నివాళులర్పించారు.

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్ సరికాదు

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై28: మండల పరిధిలోని పేరువంచ పాఠశాల ఆంగ్లఉపాధ్యాయురాలు డి.శిరీషపై విధించిన సస్పెన్షన్ సరికాదని, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని పలు ఉపాధ్యా సంఘాలు తెలిపారు. ఎస్టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు, యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గా భవాని, జిల్లా కమిటీ సభ్యులు, తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ షౌకత్ అలీ తదితరులు డిమాండ్ చేశారు. ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా, ఎంక్వైరీ లేకుండా చర్యలు తీసుకున్నారని ఆరోపించారు.

శ్రీనివాస్ ఆశయ సాధన కోసం కృషి చేయాలి

చింతకాని జూలై 28: అలవాల శ్రీనివాస్ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఎం మడిపల్లి గోపాలరావు అన్నారు. మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో ప్రముఖ న్యాయవాది సీపీఎం నాయకులు అలవాల శ్రీనివాస్ 9వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలన్నారు. కేంద్రం కార్పోరేట్ల చేతిలో కీలుబొమ్మగా మారిందని, నిస్వార్థంగా ప్రజల తరపున పోరాడేదే కమ్యూనిస్టులన్నారు. కార్యక్రమంలో వత్సవాయి జానకిరామలు,లింగం కోటేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

ముదిగొండ, జూలై28: వ్యవసాయరంగానికి రూ.72వేల కోట్ల బడ్జెట్ కేటాయించినందుకు ఆదివారం ముదిగొండ మండలం వెంకటాపురంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. వ్యవసాయ క్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఫ్లెక్సీతో రైతులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బులెట్‌బాబు, గుడిపూడి బుచ్చిరామయ్య, ఝాన్సీరాణి, ఉసికల రమేష్, కందిమళ్ల వీరబాబు, కృష్ణమోహన్, కాంతారావు, బాలచందర్ పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ' అటానమస్‌కు ఆమోదం

ఖమ్మం ఖానాపురంహవేలి జూలై 28: నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలకు ఇటీవల అటానమస్ హోదాకు జేఎన్‌టీయూ హైద్రాబాద్ అనుమతులు మంజూరు చేసింది. తెలంగాణ స్టేట్ హైయర్ ఎడ్యుకేషన్ ప్రస్తుతం జరుగుతున్న ఎప్‌సెట్ కౌన్సిలింగ్‌లో ఎస్‌బీఐటీ కళాశాలను అటానమస్‌గా గుర్తించిందని కళాశాల చైర్మన్ కృష్ణ ఆదివారం తెలిపారు. విద్యార్థులు ఎప్‌సెట్ కౌన్సిలింగ్‌లో అటానమస్ హోదా కలిగిన ఎస్‌బీఐటీ కళాశాలకు మొదటి ప్రాధాన్యతగా ఎంచుకోవాలని సూచించారు.